## ***గురుదేవులచే ఇవ్వబడిన యుగసాధన*** (06.09.07 వ తారీకు ఉపన్యాసము)

రాత్రి చీకటిలో బయటకు వెళితే చీకటిగా వుంటుంది. అది అర్ధరాత్రి అయినా అంతే, బ్రాహ్మీముహూర్తము ముందు అయినా అంతే. చీకటి చీకటే. ఎంత గొప్ప వ్యక్తి అయినా చీకటి తర్వాత వచ్చే సూర్యోదయమును ఆపలేడుగదా? కాలధర్మము మారిపోతోంది. ఆ ధర్మమును ఎవ్వరూ మార్చలేరుసరికదా, మనిషి దానికి అనుగుణ్యంగ మారితీరాల్సిందే. ఇది ప్రకృతి నియమము. సూర్యోదయ మైనా కొంత సమయము చీకటిగానే వుంటుంది. అలాగే కాలము మారినా కొంత సమయమువఱకు పరిస్థితులు అలానే వుంటాయి. సూర్యోదయము అవుతుంటే ఆ పరిస్థితులకు తగిన పనులను చేయాలి. అలాగే కాలము మారుతోందిగనుక యీ యుగమునకు అంటే యుగసంధిసమయమునకు తగిన పనులను చేసితీరాలి. ఆ పనులేంటి అన్నవి గురుదేవులు శ్రీరామశర్మఆచార్యగారు తెలియజేశారు. అవి-----

*1. గాయత్రీ దేవాలయము* : గాయత్రీమంత్రజపము అత్యంత ప్రముఖమైన అంశము. గాయత్రీతో యుగసంధిసమయమునకు తగిన మార్పులు తీసుకురావచ్చు. కనుక ప్రతివారు గాయత్రోపాసకులుగా మారాలి. అంటే ప్రతి ఇల్లు ఒక గాయత్రీ దేవాలయముగ మారాలి. ఆ దేవాలయములో రెండుపూట్లా ఆరతియ్యాలి. అంటే ప్రతి ఉపాసకుడు సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో జపము, పూజ, ఆరతి చేయాలి. హరిద్వార్ విధానములను వీటికోసము అనుసరించండి. ఇవి చేస్తే మీరు గురుదేవుల కార్యక్రమంలో పాలుపంచుకున్నట్లే. ఇది చేసే సమూహమునకు 'దేవాలయ సమూహము' అని పేరు. ఇలా చేసేవారు అఖిలగాయత్రీవిశ్వసమూహంలో సభ్యులౌతారు. ఇలాంటివారిని హైదరాబాద్‌లోనే 8,000 మంది తయారుచెయ్యండి.

*2. గురుకులము* : మరో సమూహం ద్విసంధ్యలలో గాయత్రీచాలీసా(గాయత్రీ ఆరతిచ్చి) పారాయణ చేస్తారు.

ఇలాంటి సమూహంతో గురుకులాలు స్థాపించండి. అక్కడ ఉషోదయంలో 4.30కి స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల జాగరణ సాధనను గురువుగారి వాక్కులలో విని సాధన చేయాలి. మధ్యాహ్నం జ్యోతి అవతరణ సాధన మాతాజీ వాక్కులలో విని సాధన చేయాలి. నేటి యుగధర్మమునకు అనుగుణ్యమైన శబ్దములు మీ మస్తిష్కంలోకి వెళ్ళే నాదసాధన నిత్యము జరగాలి. నాదసాధనతో మీ ఆలోచనలు, ఊహలు మొదలగునవి మారిపోతాయి. ఇలాంటి గురుకులాలు 1000 స్థాపించండి. అయితే గాయత్రీదేవాలయము వున్నచోటునే గురుకులాలు స్థాపించుకుంటే చాలా మంచిది. ఎందుకంటే గురుకులం వుంటే ఆరతి, పూజ, జపము మొదలగునవి సాగాలికదా! అంటే గాయత్రీ దేవాలయమునుండి గురుకులం స్థాయికి యెదగాలి.

గురువు=అజ్ఞానాంధకారమును తొలగించే వ్యక్తి. ఆ గురువుయొక్క కులములో చేరాలి. అదే గురుకులము. కులము అంటే యే సమూహమునకైనా చెందవచ్చు. అంటే సాయి, సి.వి.వి. మొదలగు గురువులను అనుసరించవచ్చు. అయితే గురుదేవులు ఆధ్యాత్మికవిద్యకు చెందిన సూత్రములను చాలా స్పష్టంగా అందజేశారు. కనుక గాయత్రీకులములో చేరండి. రెండుపూటలా ఆరతి జరిగే దేవాలయము, అక్కడికి వెళ్ళినవారి కోరికలు తీరుస్తుంది. ఉదా॥ సాయి దేవాలయము. సరైన సమయంలో ఆరతులు జరుగుతాయిగనుక ఫలితాలొస్తున్నాయి. గాయత్రీ దేవాలయమునుకూడ ఆ స్థాయికి తీసికెళ్ళాలి.

దేవాలయంనుండి గురుకుల స్థాయికి ఎదిగిన చోటుకు నేను వెళ్ళి అక్కడ సాధన చేసుకుంటాను. నా జపము, మీ జపము అక్కడ కచ్చితంగా కొనసాగాలి. కనుక జపము చేసే సమూహం ఒకటి తయారుకావాలి. వారు కచ్చితంగా సహస్రగాయత్రీ నిత్యము చేయాలి. గురుకులములో జపము చేసేవారు ఉదయము గాయత్రీ ఆరతి తర్వాత జపము మొదలెట్టి సాయంత్రం ఆరతిలోపల పూర్తిచేయాలి. ఇలాగ జపము చేసేవారు హైదరాబాద్‌లలో 1000 మంది కావాలి. ఇలాగ చేస్తే నెలకు 24కోట్ల గాయత్రీజపము పూర్తవుతుంది. నెలకు 24 కోట్ల గాయత్రీ జపము చేసే ప్రాంతములో యెంత శాంతి నెలకొంటుందో అసలు మీరు ఊహించలేరు. అందుచేతనే గురుదేవులు జపమునకు అంత ప్రాముఖ్యమిచ్చారు. ఆయన శరీరము వదిలేసేరోజునకూడ జపము పూర్తిచేసి మరీ శరీరము వదిలేశారు.

*3. ఆరణ్యకాలు* : గురుకులం తర్వాత ఆధ్యాత్మికజగత్తులో ఆరణ్యకాలు వస్తాయి. ఇవి తీర్థస్థలంలోనే వుంటాయి. ఆరణ్యకాలలో ముఖ్య విషయము యేమిటంటే గృహస్థులకున్న సమస్యలకు లేదా సమస్యలతో బాధపడుతున్నవారికి ఆధ్యాతికోపశమనమును సూచిస్తారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమస్యలకు అక్కడ జవాబు చెబుతారు. ఆరణ్యకాలలో చాలా ప్రముఖపాత్ర విశిష్ఠమైన తపశ్శక్తిసంపన్నులకే వుంటుంది. అంటే ఋషుల స్థాయి వ్యక్తులు అక్కడుండాలి. ఈనాడు యిలాంటివారు అరుదు. ఆరణ్యకాలలో ఋషుల మార్గదర్శనం లభించాలంటే సాధకుని జీవితంలో యోగం, తపస్సు అనే రెండు సాధనలు ఉండాలి. అలాంటివారు ఋషులను ఆశ్రయిస్తే అప్పుడు వారు తమ తపశ్శక్తిని ధారబోస్తారు.

యోగము, తపస్సునకు గురుదేవులు "ప్రతిదినము క్రొత్తజన్మ, ప్రతిరాత్రి క్రొత్త మృత్యువు" అనే సాధనను అందించారు. తపస్సులో ఆలోచనావిధానము మారాలి. మనిషిలోని కషాయకల్మషాలు పోవాలి. ఆలోచనావిధానము మారకుంటే ప్రపంచములో ఎవ్వరు సహాయము చేయలేరు. రావణాసురుడికి తపస్సు చేసే మానసికస్థితి వున్నదిగాని యోగము లేదు. అందుచేతనే అతనికి ఋషులు సహాయం చేయలేకపోయారు. రాక్షసులకు లేనిది, ఋషులకు వున్నది యోగము. శాంతికుంజ్ ఆశ్రమంలో తపశ్శక్తి వున్నది, యోగము వున్నది. కనుక శాంతికుంజ్ ఆరణ్యకమునకు ప్రతి సాధకుడు వెళ్ళితీరాల్సిందే. తపస్సు, యోగవిద్య ద్వారా క్రొత్త జన్మ, క్రొత్త మృత్యువు అనే సాధన నేర్పబడుతుంది. మీ సమస్యలకు యోగము, తపస్సుల ద్వారా పరిష్కారము లభిస్తుంది.

*4. ఆశ్రమాలు* : తర్వాత ఆశ్రమాలు వస్తాయి. అంటే ఆధ్యాత్మికవిద్యను నేర్పించగలిగే చేతనత్వములు అక్కడ వుంటాయి. అంటే అవి విశ్వవిద్యాలయములు అన్నమాట. ఋషిపరంపర స్థాయిలో వున్నవారు అక్కడ వుంటారు.

*5. తీర్థస్థలములు* : విశిష్ఠమైన ఆలోచనలు వున్నవారు కొంతమంది వున్న ప్రదేశమును తీర్థము అంటాము. అంటే అక్కడ వారియొక్క ఆలోచనలు ఘనీభవించి వుంటాయి. కాబట్టి అక్కడికి వెళ్ళినవారి కోరికలు లేదా లక్ష్యములు తప్పక తీరుతాయి.

శాంతికుంజ్ పై ఐదు లక్షణములను కల్గివున్నది. కనుక ప్రతీ గాయత్రీ సాధకుడు శాంతికుంజ్‌కు సాధనా నిమిత్తము వెళ్ళితీరవల్సినదే. గాయత్రీ జపమును నెలకు2 4 కోట్ల చేసే సమూహమును తయారుచేయండి. అప్పుడు గాయత్రీ అనే జ్ఞానగంగ ప్రవహించి, దానితో భూమిపై స్వర్గావతరణం జరుగుతుంది. ఇవన్నీ చేయటమే యీ యుగధర్మము.. ఈవిధంగా జపానుష్ఠానము చేసేవారందరూ వారానికి ఒకసారిగాని లేదా పూర్ణిమకుగాని పూర్ణాహుతి చేసుకోవాలి. ఈ నియమాలను పాటించే ప్రతి యింటికి గురుదేవుల "దేవస్థాపన" ఫొటోలు వీలైనంత త్వరంలో స్థానిక కార్యకర్తల ద్వారా అందజేయబడతాయి. ఈ గాయత్రీ సాధకులందరూ తప్పనిసరిగా "ప్రపంచ గాయత్రీ పరివార్" సభ్యులుగా మారాలి. అలా మారినప్పుడే వారు పూజ్యగురుదేవులతో సంబంధమును కల్గివుంటారు. ..........స్వస్తి.........

## *గాయత్రీమహావిద్య - శ్వాస - గీత* (3వ తారీకు ఉదయం ఉపన్యాసం,)

కృష్ణాష్టమిని మనము జగద్గురుపర్వంగాకూడ అవగాహన చేసుకోవల్సిన అవసర మున్నది. ఈ కృష్ణాష్టమి భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రముఖపాత్ర వహించబోతున్నది. కనుక నేను చెప్పిన విషయములు ఆచరణలో పెట్టండి. మహాభారతయుద్ధంలో చెప్పబడిన గీతగురించి స్వయంగా శ్రీకృష్ణుడు యేమి చెబుతాడంటే 'గీతలో చెప్పబడిన జ్ఞానవిజ్ఞానముల నుపయోగించుకుని నేను మూడులోములను పరిపాలిస్తున్నాను' అని. మరి ఆ భగవద్గీత చదువుతున్న మనము మన కుటుంబజీవితమునే సరిగ పరిపాలించుకోలేకపోతున్నాము. కారణము యేమిటి? మూడులోకములను పరిపాలించే జ్ఞానము భగవద్గీతలో వున్నది. శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా మూడులోకములను పరిపాలించే ఆ జ్ఞానమును పొందలేకపోతున్నాము. ఎందుకంటే గీత నైతే చదువుతున్నాంతప్ప అందులో చెప్పబడిన జ్ఞానమును ఆచరణలో పెట్టడం లేదగనుక.

చాలాచోట్ల చాలామంది ముక్తిని కోరుకుంటారు. అంటే వారు బాధ్యతలనుండి విముక్తి చెందా లనుకుంటున్నా రన్నమాట. అంటే అది వారి చేతకానితనమును సూచిస్తోంది. మహాభారతయుద్ధం ముందు అర్జునుడు - శ్రీకృష్ణునితో, నేను యుద్ధం చెయ్యను - అని చెబుతాడు. యుద్ధమునకు ముందు అర్జునుడికి తాను భీష్మాదులతో యుద్ధం చేయాలని తెలియదా? తెలుసు. అయినా యుద్ధమును యెదుర్కొంటునప్పుడు వచ్చే భావములు మారిపోతాయి.

కనుక జీవిత సంగ్రామంలో అర్జునుడే ధైర్యం కోల్పోతే మనం ధైర్యం కోల్పోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ అర్జునుడికి యేవిధంగా అయితే దెబ్బలాడే సామర్థ్యము రావడమేకాకుండా, అతనిచేత యే జ్ఞానము యుద్ధం చేయించిందో ఆ జ్ఞానమును మనము పొందికూడ వుపయోగించుకోలేని విషయపరిస్థితులలో యిరుక్కున్నాము. జ్ఞానమును వుపయోగించుకుంటే గెలుపు నీదే అవుతుంది. అసంభవం సంభవ మౌతుంది. శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్పేదేమిటంటే మీరు గీతలో చెప్పబడిన జ్ఞానమును వుపయోగించుకుంటే అసంభమైన గెలుపు మీదే అవుతుంది.

మహాభారతంలో భీష్ముడికి ఇచ్ఛామరణ మున్నది. యుద్ధంలో తన వ్యతిరేక సైన్యమునకు నాయకత్వం వహించిన భీష్ముడు తాను మరణించాలని కోరుకుంటాడా? కోరుకోడుగా! అర్జునుడు ఇంకేమి గెలుస్తాడు?

ద్రోణుడు స్వయంగా అర్జునుడి గురువు. ఆయన తన అస్త్రశస్త్రములను తనంతట తాను త్యజించనిదే ఆయనను యుద్ధంలో ఎవరూ గెలువలేరు. ద్రోణుడి మృణ్మయ ప్రతిమతోనే ఏకలవ్యుడు అర్జునుడి కంటే యెక్కువ యుద్ధసామర్థ్యమును సముపార్జించుకున్నాడు. మరి ద్రోణుడికి ఎంత సామర్థ్య ముండివుంటుంది? అర్జునుడు ద్రోణాచార్యుని దగ్గర విలువిద్య పూర్తిగా నేర్చుకోలేదు. ఈ విషయము అర్జునుడికి తెలుసు. మరింక ద్రోణునితో యుద్ధంలో యేమి గెలుస్తాడు? భీష్ముడిని గెలువలేడు, ద్రోణుడిని గెలువలేడు. అర్జునుడికి యివి రెండూ అసంభవాలే.

జయద్రథుడు ఒకరోజు ఒక్క అర్జునుడితప్ప మిగతా పాండవులను నిలువరించగలడు.

కర్ణుడు దగ్గర స్వయంగా అర్జునుడి తండ్రియైన ఇంద్రుడు ప్రసాదించిన శక్తి అనే అస్త్రమున్నది. కనుక కర్ణుడిని నిలువరించడంకూడ అర్జునుడికి అసంభవము.

ఇన్ని అవరోధాలు వున్నప్పటికి గీతను వినడంవలన అర్జునుడు గెలుపు అసంభవమైన ఆ యుద్ధంలో గెలుపును సాధించాడు. మరి గీత యిచ్చే యీ సాహసమును మీరు పొందగలుగుతున్నారా? లేదే. కనీసము కృష్ణాష్టమినుండి అయినా గీతలో చెప్పబడిన విషయములను ఆచరణలో పెట్టండి. గీతను వుపయోగించుకుని దేశవిదేశాలలో అనేకమంది మహనీయులు వారివారి జీవితములను మలచుకున్నారు. ఉదా॥ తిలక్, వివేకానంద మొదలగు మన స్వదేశీయులు. అలాగే విదేశీయులు. వీరందరూ భగవద్గీత మీద ఆధారపడి వారివారి సిద్ధాంతములను మలచుకున్నారు. ఆ గీతను మనము చదువుకుంటున్నాము. దేశచరిత్రను మార్చడానికి సామర్థ్యము నిచ్చిన గీత మన జీవితాలను దిద్దలేకపోతున్నది. అది మన జీవితాలను కచ్చితంగా మారుస్తుంది. మార్చటానికి మీరేమి చేయాలి?

ఆధ్యాత్మికవిద్య అంటే జీవించేకళ. జీవితంనుండి పాఱిపోయేకళ కాదు. మన భారతీయ ఆధ్యాత్మికత యేనాడు శూన్యత్వంగురించి చెప్పలేదు. పూర్ణత్వం గురించి వుటంకించింది. అంతా పూర్ణమే మనకు. కనుక ఆధ్యాత్మికవిద్య లేక గీత అయిన యేదైనా జీవించేవిద్యను చెబుతుంది. అంతేగాని జీవితంనుండి పాఱిపోవడం నేర్పదు. మరి మీకు జీవించడం వచ్చా? జీవించడానికి ఆధారము యేమిటి? శ్వాస. ప్రాణముంటే మనము జీవిస్తాము లేకపోతే మనము చనిపోతాము. ఆ ప్రాణశక్తిని మనము వుపయోగించుకోవడంలేదు. మనమందరంకూడా ప్రాణవంతులమే, మనమందరంకూడా చైతన్యవంతులమే. అందులో అనుమానంలేదు. కానీ మనలో వున్న ప్రాణశక్తిని వుపయోగించుకోవడం మనకు రాదు. తెలియదు. భగవద్గీత అది చెబుతుంది. రోగనివారణకూడ చేస్తుంది. గీతతో రోగనివారణ అన్నది అతి చిన్న అంశ. మనము ఎప్పుడు రోగముతో బాధపడం కదా? అప్పుడప్పుడు మనము వ్యాధితో బాధపడతాము. కనుక ప్రాణశక్తితో రోగనివారణ ముఖ్యంకాదు. ప్రాణశక్తితో జీవించడం అనేది చాలా ముఖ్యం. అది గీత చెబుతుంది. నీలో వున్న ప్రాణశక్తిని నువ్వు యెలా వుపయోగించుకోవాలో గీత చెబుతుంది. దాన్నే మనము 'గయాన్ త్రాయతి ఇతి గాయత్రి' అని సంస్కృతంలో చెబుతాము. ప్రాణములను రక్షించేది గాయత్రి.

అందుకే భగద్గీతలో శ్రీకృష్ణుడు యేమి చెబుతాడు? నాకు ఆధారము యేమిటంటే గాయత్రి అని. . అసలు ఛందస్సులలో నేను గాయత్రిని అని స్పష్టంగా చెప్పాడు. ఛందస్సు అంటే ఆవరణ. ఏ ఆవరణ? మన శరీరంయొక్క ఆవరణ. ఇంకా లోతుగా చెబితే పంచశరీరముల లేదా కోశముల మీద ఆవరణ. ఛందస్సు యే ప్రాణములమీద వుంటుందో ఆ ప్రాణశక్తిని నేను అంటాడు. మరి ఆ ఆవరణలు మనమీదకు యెలా వస్తున్నాయి? వాటిని ఎలా తెలుసుకోవాలి? వాటిని ఎలా వుపయోగించుకోవాలి? అన్న విషయాలకు గీత మొదటగా యేమి చెబుతుందంటే మీరు శక్తి స్వరూపులు అని.

మనము మన శక్తిని మర్చిపోయాము. సింహం కథ దీనికి వుదాహరణగా చెబుతారు. ఒక సింహంపిల్ల అనుకోకుండా ఒక గొఱ్ఱెలమందలో కలిసింది. వాటితోపాటే పెరిగింది. అయితే దానికి తనకు గొఱ్ఱెలకు మధ్య తేడా వున్నదని మాత్రం అర్థమౌతోంది. ఇంతలో మఱో సింహం యీ సింహప్పిల్లని చూసి 'నువ్వు గొఱ్ఱెలమందలో వున్నప్పటికి, అక్కడే పెరిగినప్పటికి నువ్వు గొఱ్ఱెవి కాదు, సింహానివి' అని తెలియజేసింది. దానితో ఆ సింహప్పిల్ల తన ఆలోచనలను మార్చుకుని సింహంలాగే ప్రవర్తించడం మొదలెట్టింది. మనంకూడ అలా చేస్తే చాలు. మనంకూడ భౌతికజీవితంలో యిరుక్కుపోయాము. అదే శాశ్వతమని అనుకుని అక్కడే సుఖదుఃఖాలు అనుభవిస్తూ జీవించేస్తున్నాము.

మీలో వున్న శక్తి జాగృతమవ్వడానికి మీరేమి సాధనలు చేయాలి? ఏమి చేయనవసరంలేదు. గుర్తిస్తే చాలు. సింహంలాగ మారటానికి సాధనలు అవసరంలేదు. శక్తి వున్న వ్యక్తి శక్తి సముపార్జన చేసుకోవడానికి యెవరిని దేవులాడనవసరంలేదు. కానీ గుర్తించాలి. అంతే. సింహం వచ్చి ఆ పిల్ల సింహంమీద పడితే అది భయపడి పాఱిపోయింది. అలాగే మనంకూడ యెన్ని యజ్ఞాలు చేస్తున్నా, జపాలు అవీ చేస్తున్నా మనము శక్తివంతులము అని గుర్తించకుండా చేసేస్తున్నాము. ఫలితముకూడ దానికి తగినట్లుగానే వస్తున్నది. సాధన చేస్తున్నారంటే అర్థము నువ్వు శక్తిమంతుడవు కాదు అనేగా! లేనిది పొందటానికేగా సాధనలు చేసేది.

గీత ఏమి చెబుతుందంటే నువ్వు సాధన చేయడం లేనిది పొందటానికి కాదు, ఉన్నది యెలా వుపయోగించుకోవాలో తెలిసికుని ఆ శక్తిని వుపయోగించుకునేందుకు అని చెబుతుంది. పిల్లవాడు నడక నేర్చుకోవడానికి ప్రత్యేకంగా శరీరమును సంపాదించుకోనవసరం లేదు. అతనికి శరీరము వున్నది. దాన్నుపయోగించుకుని నడక నేర్చుకుంటే చాలు. ఇక్కడా అంతే.

దీనికే గీత యేమి చెబుతుందంటే 'స్వధర్మే నిధనం శ్రేయః, పరధర్మో భయావహః' అని. నువ్వు ధర్మంకోసం ఇతరులను ఆశ్రయించనక్కఱ్లేదు. శరీరము నీ దగ్గఱే వున్నది. కానీ నీ శరీరమును లేక ధర్మమును దోషభూయిష్టమైనది అని అనుకుంటున్నావు. ఇతరులది చూసి అది బావుంది అని దాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తున్నావు. అది చెరుపుచేస్తుంది. శక్తిని సంపాదించుకోవడానికి నువ్వు యెక్కడికి వెళ్ళనవసరంలేదు. శక్తి నీలోనే నిబిడీకృతమైవున్నది. మరి సర్వశక్తిమంతుడైన వ్యక్తి తన జీవితమును యెలా మలచుకోవాలి? దానికి --

అనన్యాశ్చింతయన్తోమాం.....మ్యహమ్ అన్నాడు జగద్గురువు. ఇది మొత్తం ఆధ్యాత్మికవిద్యకు ఆధారము. నువ్వు సర్వశక్తిమంతమైన చేతనత్వమును కలిగియున్నావు. ఆ శక్తికి సమర్పణ చేసుకో. నేను ఫలానా ఆవిడ భర్తని, ఫలానా బాలునికి తండ్రిని......... ఇవన్నీ మనిషి సమాజంలో యేర్పరచుకున్న భేదములుమాత్రమే. ప్రతివ్యక్తిలోను ఒక సర్వశక్తివంతమైన చేతనత్వము నెలకొనివున్నది. ఆ చేతనత్వమునకు నువ్వు సమర్పణ చేసుకో. అందుచేత ఆధ్యాత్మికవిద్య సమర్పణ చేసుకోవడం నేర్పుతుంది.

శాస్త్రవేత్తలు ప్రకృతికి చాలా బాగా సమర్పణ చేసుకుంటారు. వారు తాము పనిచేసే శక్తికి సమర్పణ చేసుకున్నారు. ఉదా॥ ఎలక్ట్రిక్ ఇంజనీర్ విద్యుచ్ఛక్తికి సమర్పణ చేసుకున్నాడు. తనిష్టమొచ్చినట్లు విద్యుత్తును వుపయోగించడు. విద్యుత్తుయొక్క నియమాలకు అనుగుణ్యంగా తను ప్రవర్తిస్తాడు. విద్యుత్తుయొక్క నియమాలకు అనుగుణ్యంగా తను మారాడనేగా అర్థము!! విద్యుత్తుతో పనిచేస్తున్నప్పుడు చాలా జాగరూకతతో ప్రర్తిస్తాడు. లేదంటే షాక్ కొడుతుంది. ఇదే అనన్యశ్చింత. పనిచేస్తున్నప్పుడు ఎఱుక కలిగివుండాలి.

అంతేగాని పనిచేస్తున్నప్పుడు రామరామ అనుకుంటూ, రామరామ అనుకోవాల్సిన సమయంలో పనిగురించి ఆలోచిస్తూ వుంటే అది తప్పు. పనిచేస్తున్నప్పుడు ఎఱుకలో వుండాలి. నోటితో దైవనామమును వుచ్చారణ చేయనవసరంలేదు. నీలోనే ఆ దైవం వున్నాడు అనే ఎఱుకతో వుండాలి. నీలో వున్న శక్తిని నువ్వు పట్టించుకోవడం లేదు. ఆ శక్తికి నువ్వు యెలా సమర్పణ చేసుకోవాలి అనేది గీతలో ఇలా చెబుతాడు. సర్వధర్మాన్ పరిత్యజ్య.........శుచః

మనము సాధారణంగా ప్రదక్షిణలుచేస్తున్నప్పుడు ఒక శ్లోకం చదువుతాము. పాపో2హం పాపాత్మా పాపసంభవః .........అని యేదేదో చదువుతాము. నువ్వు ఆత్మస్వరూపుడివి అని ఋషులు అంటుంటే నేను పాపిని అంటే యెలా? మీరు బలహీనులు కారు. శక్తిసంపన్నులు మీరు. ఆ శక్తికి సమర్పణ చేసుకోవాలి. మీరు చేసే యజ్ఞము ఆ సమర్పణ విధానము నేర్పుతుంది. ఆ సమర్పణావిధానము మీ జీవితంలో ప్రవహించాలి.

గీత 3 వ అధ్యాయంలో " సహయజ్ఞాప్రజాసృష్ట్వా........ధుక్" అని చెబుతాడు. అంటే మీ కోరికలు తీరాలంటే మీకు యజ్ఞవిద్య తెలియాల్సిందే. మీరు మళ్ళీ ప్రత్యేకంగా యజ్ఞమును నేర్చుకోవల్సిన అవసరములేదు. యజ్ఞకర్మ మీతోబాటే పుట్టింది. నువ్వు పుట్టగానే జీవించివున్నావు అన్నదానికి గుర్తు నీలో శ్వాస ప్రవహించడము. పిల్లవాడు యేడిస్తే శ్వాస లోపలికి ప్రవేశిస్తుంది. అలాగే మరణించినప్పుడు శ్వాస ఆగిపోతుంది. అంటే తుదిమొదలు రెండూ శ్వాసే అని తెలుస్తోందికదా! అంటే మీతోబాటే భగవచ్ఛక్తి శ్వాసరూపంలో మీలోకి ప్రవహిస్తుంది. అదున్నంతవఱకు నువ్వు ప్రాణవంతుడివి. ఆగిపోతే మరణిస్తావు.

అలాంటి శ్వాసను వుపయోగించుకోవడం మర్చిపోయాము. గాయత్రీమంత్రము భగవద్గీతయొక్క సారము. ఆ గాయత్రీమంత్రము ఆధారంగానే నేను మూడులోకములను పరిపాలిస్తున్నాను అంటాడు జగద్గురువు. మీరు మీ కుటుంబాలను, సమాజమును శ్వాసద్వారా పాలించుకోవచ్చు. అయితే శ్వాసను యెలా వుపయోగించుకోవాలి? దానికొక సూత్ర మున్నది. ఆ సూత్రమును నిత్యజీవితంలో వుపయోగించుకోవాలి. గాయత్రీ మంత్రము ఒక ఛందస్సు, ఒక సూత్రము. దాన్ని వుపయోగించుకోవడం నేర్చుకోవాలి. ఊరికే సూత్రమును వల్లెవేస్తున్నాము. ఉపయోగించుకోవడానికి ఆ సూత్రమును గూర్చి అవగాహన కలిగియుండాలి. గాయత్రీమంత్రంలోని భూర్, భువః, స్వః అనే మూడు అక్షరములు మనకున్న మూడు శరీరములు. అవి స్థూల, సూక్ష్మ, కారణములు.

స్థూలజగత్తులో - నిప్పులో చెయ్యిపెడితే కాలుతుంది. మంచులో చెయ్యిపెడితే చల్లగావుంటుంది. అంటే స్థూలజగత్తులో వున్న కార్యకారణ సంబంధము మనకు తెలుసు. కనుక మనకు యెలాంటి పరిస్థితులు కావాలో అలాంటి పరిస్థితులు ఏర్పరచుకోవడానికి యేమి చేయాలో మనకు తెలుసు.

భువః, స్వః తలములలో అంటే కోరికలతలంలో, ఆలోచనలతలంలో యీ కార్యకారణ సంబంధమును మర్చిపోయాము. అది గాయత్రీమంత్రము చెబుతుంది.

మన కోరికలజగత్తులో, ఆలోచనలజగత్తులో శక్తి కావాలంటే స్థూలజగత్తుకు ఏ కేంద్రబిందువు మీకు ఆధారమో, అదే బిందువు వీటికికూడ ఆధారము. స్థూలజగత్తుకు కేంద్రబిందువు -సూర్యభగవానుడు. ఆ సూర్యుడియొక్క కోరికలు, ఆలోచనలు పట్టుకోగలిగితే జీవితములు సవ్యమైనమార్గంలోకి మరలుతాయి.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవాన్ అహ..........బ్రవీత్ ॥ అని నాల్గవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు చాలా స్పష్టంగా నేను యీ యోగవిద్యను మొదట సూర్యుడికి చెప్పాను అని చెబుతాడు. మనము మన కోరికలను ఆలోచనలు సవరించుకోవడానికి సూర్యుని శక్తిని వుపయోగించుకోవడం మర్చిపోయాము. భగవద్గీత ఆ తప్పును సవరిస్తుంది. స్థూలజగత్తులో జరిగే మార్పులు చేర్పులు అన్నీ సూర్యునిమీదే ఆధారపడివున్నా యన్నది సైన్స్‌కూడ అంగీకరిస్తోంది. నీరు-సూర్యుడు లేకపోతే జీవితమే లేదు. ఆధ్యాత్మికవిద్య యేమి చెబుతుందంటే సూర్యుడు లేకపోతే అసలు నీ జీవితం లేకపోవడమేకాదు, నీ కోరికలే తీరవు, నీకు ఆలోచనలు రూపుదాల్చవు అని. సూర్యునిమీద ఆధారపడటం నేర్చుకోవాలి.

మన రామాయణ, భారతములు సూర్యునిమీద యెలా ఆధారపడాలో చెబుతాయి. రావణాసురుడిని గెలవాలంటే రాముడికి ఆదిత్యహృదయం కావల్సివచ్చింది. మరి ఆ ఆదిత్యహృదయంగూర్చి మనము యేమి మాట్లాడుకుంటున్నాము? రాముడి లాంటి అవతారపురుషునికికూడ సూర్యవిద్య కావల్సివచ్చింది. రావణుడి

శక్తిసామర్థ్యములను చూసి హనుమంతుడే చలించాడు. రావణుడి కున్న ఆలోచనసామగ్రి, శక్తి, సంపద అపారము. ఇవతల రామునికి యేమున్నాయి? కోతులుతప్ప. అగస్త్యుడు మాత్రం వచ్చి రాముడికి ఆదిత్యహృదయం చెప్పి వెళతాడు. హనుమంతుడుమాత్రం సూర్యోపాసకుడే.

ఆయన సూర్యుని దగ్గరే అనంతవిద్యను నేర్చుకున్నాడు. అంటే స్వయంగా సూర్యుని దగ్గర్నుండి వేదవిద్యను నేర్చుకున్న వ్యక్తి తన సైన్యమునకు నాయకుడుగా వుంటూ, మరో ఋషి వచ్చి ఆదిత్యహృదమును చెబితే అప్పుడు రాముడు రావణుడిని యెదిరించగలిగాడు. ఆదిత్యహృదయం తెలియాలి మీకు. అందులో చెప్పబడిన విధివిధానమును మీరు నిత్యజీవితంలో వుపయోగించుకోవాలి. కనుక రామాయణం మొత్తం సూర్యవిజ్ఞానమే.

మరి మహాభారతం? అదీ సూర్యవిద్యే. శ్యమంతమణిని సాధిస్తే చాలు. అపారసంపదలు సమకూరుతాయి. సూర్యుని ఆశ్రయిస్తే శ్యమంతకమణి లభిస్తుంది. పాండవులు అరణ్యావాసం చేయాలని వెళ్తుంటే అనేకమంది పౌరులు మేముకూడ మీతో అడవులకి వస్తాము అని బయలుదేరారు. అప్పుడు వారిని పోషించడానికి ధర్మరాజు ధౌమ్యులవారి సూచనమేఱకు సూర్యుని అర్థించి ఆయన అనుగ్రహంతో అక్షయపాత్రను పొందుతాడు.

గురువు లందరి దగ్గర అక్షయపాత్ర మనకు కనిపిస్తుంది. ఉదా॥ వెంకయ్యస్వామి. ఆయన పేరు చెప్పుకుని కొన్నిలక్షలమంది భోజనము చేస్తున్నారు. ఆయన పేరు చెప్పుకుంటున్నారు, అన్నము అక్షయమౌతున్నది. ఆయనేకాదు మీరు యే గురుసంస్థానానికి వెళ్లినా అన్నము అక్షయ మౌతున్న సంగతిని గమనించేవుంటారు. ఏ గురువు ఉద్యోగం చేయడంలేదు. చందాలు అడగటంలేదు ఎవరిని. ద్వాపరయుగంలోనే కాదు అక్షయపాత్ర నిరంతరంగా వున్నది, వుంటుంది. ఇది వాస్తవము. కనుకనే యే యుగంలోనైన సరే గురువుల దగ్గరకు వెళ్ళినవారి కోరికలు తీరుతున్నాయి.

ఆ అక్షయపాత్ర మీకు యెక్కడినుండి వస్తుంది? సూర్యుని దగ్గర్నుండి. సహయజ్ఞాప్రజాసృష్ట్వా......ధుక్ - నీ కోరిక తీరుతుంది. కోరికలసారమును యజ్ఞంద్వారా పిండుకో. ఎవరు చెప్పారు ఆధ్యాత్మికవేత్త కోరికలను కలిగి యుండరాదని. చేతకానివారు అనేమాట అది. ఆధ్యాత్మికవేత్తకు తీరని కోరికంటూ వుండదు. తీర్చలేని కోరికంటూ వుండదు. గురువు దగ్గరకు మనము కోరికలతోనే గదా వెళ్లేది?

ఉపనిషత్తులు, వేదాలు మొదలగువాటిలో ఒకే ఒక ఉపాస్యశక్తినిగూర్చి చెప్పారు. ఉపాస్య - అనగా దగ్గర కూర్చోవడం. ఎవరి దగ్గరి మీరు కూర్చుంటే ఆ లక్షణాలే మీకూ వర్తిస్తాయి. చందనవృక్షం దగ్గర కూర్చుంటే నీ దగ్గరా చందనపరిమళం వస్తుంది. ఈ మధ్యకాలంలో మనము సూర్యుని ఆరాధించడము మర్చిపోయాము. ఆయనను వుపయోగించుకోవడం మర్చిపోయాము. ఏ ఆధ్యాత్మికశక్తి కేంద్రము మనకు రాత్రిపగలు కనిపిస్తువుంటుందో; ఆయనను గుర్తించడంలేదు మనము. ఆయనను వదిలేసి మిగతా అన్నింటిని పట్టుకోవడం వలన మనిషి క్రిందికి జాఱాడు.

ఇంతకీ సూర్యోపాసన ఎలా చేయాలి? అనేది తెల్సుకునేందకు అసలు ఈ సూర్యవిద్య నేర్పే విశ్వవిద్యాలయం యెక్కడున్నదో తెలియాలి మీకు. అది తెలియకపోతే మీరేమి చదువుతారు? సూర్యుని కోరికలతో మీ కోరికలను జోడించండి. సూర్యుని ఆలోచనలతో మీ ఆలోచనలను జోడించండి. ఎందుకు? సూర్యవిద్య రావడానికి. అసలు యే విద్య నేర్చుకోవాలన్నా పద్ధతి యిదే. ఆధ్యాత్మికవిద్య జీవించేకళ అనగా సూర్యోపాసన అని అర్థమైందికదా? కనుక మీరు సూర్యోపాసన చేయదలచుకుంటే లేదా యీ విద్యను మీరు నేర్చుకోదలచుకుంటే ఆ విద్యను నేర్పే విశ్వవిద్యాలయంలో సభ్యులుగా చేరాలి. ఇంతకీ ఆ విశ్వవిద్యాలయం యెక్కడున్నది? పవిత్రహిమాలయపర్వతశ్రేణులలో వున్నది.

మొత్తము ఆధ్యాత్మికవిద్యయొక్క కేంద్రము యెక్కడున్నది అంటే ఉత్తుంగ హిమాలయశ్రేణులలో. ఆ హిమాలయములకు తీర్థయాత్రలకు వెళుతున్నాము. ఋషులు చేసే తీర్థయాత్రలకు యీనాడు మనము చేస్తున్న తీర్థయాత్రలకు సాపత్యమేలేదు. అసలు రెంటిని పోల్చడం అనవసరము. నక్కకు-నాకలోకానికి వున్నంత తేడా వున్నది. పూర్వకాలంలో తీర్థయాత్రలను పాపము పోగొట్టుకోవడానికి చేసేవారు. అంటే చేసిన తప్పు సరిదిద్దుకోవడానికి. బదరీనాథ్‌కు యీనాడు తీర్థయాత్రలకు వెళ్ళి మనము యేమి చేస్తున్నాము? ఒక్కసారి ఆలోచించుకోండి. ఆధ్యాత్మికశక్తికేంద్రంగా అది యుగయుగాలుగా భాసిల్లుతున్నది. కనుక మీకు ఆధ్యాత్మికవిద్య నేర్చుకోవాలనుకుంటే దానిలో సభ్యులుగా చేరండి.

.......స్వస్తి..........

(శ్రీమతి లక్ష్మిగోపాల్, ఒంగోల్)